ఎండ నిప్పులు చెరుగుతూంది. కారు నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు మీద మెలికలు తిరుగుతూ ప్రరున జారి పోతూంది. సీట్ల మెత్తదనంతో, కారు కుదుపులకు మగతగా కన్ను మూశాడు రామనాథం. కారు శరవేగంతో పెద్ద గేటు లోంచి దూసుకొని, రోడ్డుకు రెండు వైపులా ఏపుగా పెరిగిన చెట్ల పీడలు చీల్చి పోర్టికోలో నిలిచింది. డ్రైవరు సీటులోంచి బయటికి నడిచి యూనిఫారం సర్దుకుని వెనక డోర్ తెరిచాడు. రామనాథం నిద్రాదేవి ఒడిలో ఆనందిస్తున్నాడు. డ్రైవరు క్షణం తట పటాయించి, "సార్!" అని పిలిచాడు.

రామనాథం కండ్లు తెరిచి, "ఓ! ఐయామ్ సారీ" అని కారు దిగాడు. డ్రైవర్ సెల్యూట్ చేసి కారు తలుపు వేశాడు.

రామనాథం ఎండలు ధిక్కరించే నరుపుల్లాంటి లాన్సుని, అందులో పరవ శంతో నీళ్ళు చిమ్మే ఫౌంటెన్‌ని చూసి తృప్తిగా ఊపిరి పీల్చాడు. అది తన జీవితానికి సింబాలిజమ్‌లా కనుపించింది. తను జీవితంలో ఎవర్నీ లెక్క చెయ్య లేదు. అందర్నీ ధిక్కరించి తన జీవితం నన్నగా నడిపించుకొంటున్నాడు. భావనా పరంపరలోంచి బయటపడి గబగబ మెట్లు ఎక్కి, తలుపు తెరుచుకుని ఎయిర్-కండిషన్ రూమ్‌లో అడుగు పెట్టాడు. ఒక్కసారి ప్రాణం లేచివచ్చినట్లయింది. ఆఫీసు నుండి ఇంటికి వచ్చేటప్పటికి ఎంత అలసట! రోజూ తనకోసం ఎదురుచూసే శారద ఎక్కడ? ఆశ్చర్యంతో నలువైపులా చూసి బెల్ నొక్కాడు.

రెండు నిమిషాల తరవాత శారద వచ్చింది. "మీరు వచ్చినట్లు తెలియనే లేదు. మీకు ఒక సర్‌ప్రైజ్ ఉంది. ఏమిటో చెప్పుకోండి" అంది నవ్వుతూ.

రామనాథం ఆ నవ్వులో కరిగిపోతూ, "ఏముంది! ఏ కాంజీవరం చీరో కొని ఉంటావు, అవునా? అది కూడా చవకలో దొరికి ఉంటుంది" అన్నాడు నవ్వుతూ.

"మరే! మీ రెప్పుడూ చీరలు కొను క్కొంటున్నట్లు మాట్లాడతారు. ఇది చెప్పుకోండి — ఇంకో ఛాన్స్ ఇస్తు న్నాను."

"లత కాలేజీ ఫస్ట్ వచ్చి ఉంటుంది. కాకపోతే రాము టెన్నిస్ ఛాంపియన్‌షిప్ సంపాదించి ఉంటాడు."

"ఊహూ! అవేమీ కావు. ఇవి మన ఇంటికి సంబంధించినవి కాదు. పోనీ, ఒక క్లూ ఇస్తున్నాను, చెప్పుకోండి. మన ఇంటికి అతిథి వచ్చింది."

రామనాథం నిట్టూర్పు విడిచి సోఫాలో వెనక్కి వాలబడి, "నాకు తెలియదు, చెప్పకూడదూ సస్పెన్స్ లేకుండా?" అన్నాడు విసుగ్గా.

శారద ముఖం చిన్నబోయింది.

"అయితే వినండి, మాలతి వచ్చింది" అంది సీరియస్‌గా.

రామనాథం తల మీద పిడుగు పడిన ట్లయి లేచి కూర్చుని, అంతలో తేరుకొని శారద కండ్లలోకి సునిశితంగా చూసి, "ఎప్పుడు వచ్చింది?" అన్నాడు.

"ఒక గంట క్రితం వచ్చింది. భోజనం చేస్తూంది. లత ఆమె దగ్గర కూర్చుంది. లతకు ఎందుచేతో ఆమె అంటే వల్ల మాలిన అభిమానం పుట్టుకొచ్చింది."

రామనాథం మౌనంగా ఉండిపోయాడు.

"పదండి. ఆమెతో అక్కడే మాట్లాడవచ్చు."

"వాట్ నాన్సెన్స్! నేను ఎవరిని కలవ దలుచుకోలేదు" అన్నాడు కోపంగా.

శారద విస్తుపోయింది. "అదేమిటి! ఆమె మీకోసం ఎంతసేపు నుండో ఎదురు చూస్తూంది" అంది అనునయంగా.

"చూడు, శారదా, రామనాథంకోసం వందలమంది ఎదురు చూస్తూ కూర్చుంటారు. ఆమెను కలవటానికి నాకు వ్యవధి లేదు."

"ఇదేమి సభ్యత? ఆమె మీకు తెలియనిది కాదు. అందుచేత నేను ఆమెని గౌరవించి కూర్చోపెట్టాను. ఇప్పుడు మీరు ఆమెను చూడనంటే తల కొట్టేసినట్లుంటుంది. ప్లీజ్! ఒక్క సారి ఆమెతో మాట్లాడండి. ఏదో అవసరం ఉండి వచ్చింది. ఆమె భర్త పోయారు — మీకు తెలుసా?" అంది శారద అతనిలో చైతన్యం కల్పించ టానికి.

"తెలుసు. ఆఫీసు విషయాలు ఆఫీసు లోనే పరిష్కారం అవుతాయి. కావా లంటే నా అపాయింట్మెంటుని కలవమను. నేను పోతున్నాను" అని తలుపు తీసి, బయటికి నడిచి, తలుపు దబాలున విసిరికొట్టి చరచర వెళ్ళిపోయాడు.

శారద అవాక్కయి నిలుచుండి పోయింది. బయట కారు స్టార్టు అయిన చప్పుడు వినిపించింది. శారద కాళ్ళు కదలలేదు. సోఫాలో కూర్చుండి పోయింది. ఆమె కండ్లలో నీరు పెల్లుబికి వచ్చింది. రామనాథంతో ఇరవై రెండేళ్ళు కాపరం చేసింది కాని, అతన్ని అర్థం చేసుకోలేక పోయింది. అతనిలో మానవత్వం నశించిపోతూంది. స్వార్థం, ధనదాహం, హోదాకోసం ఎవర్నయినా త్యాగం చెయ్యగలడు. ఎవరిమీదో ఈ కసి, కోపం? అతనిలో జాలి, కరుణ ఇంత వరకు చూడలేదు. మాలతి విషయంలో అలా ప్రవర్తిస్తాడని ఎప్పుడూ అనుకో లేదు. ఒకానొకప్పుడు మాలతి చిరునవ్వు కోసం ఆమె చుట్టూ పరిభ్రమించిన మనిషేనా ఈయన? మాలతి లేకుంటే రామనాథం ఈ నాడు ఈ స్థితిలో ఉండేవాడు కాదు. ఎందుకీ కోపం? మాలతి తనని పెళ్ళి చేసుకోలేదనేనా? మాలతి పెళ్ళిచేసుకుంటే రామనాథం అలాగే ఉండేవాడా? ఇందులో తన లోపం ఉన్నదా? తను అన్ని విధాల ప్రయత్నిం చింది కాని రామనాథం అజేయుడు. 'హే భగవాన్! ఏమి టీ పరీక్ష? ఆయనకు మానవత్వం ప్రసాదించు' అని వేడుకుంది.



అంతలో తలుపు తెరుచుకుంది. లత, మాలతి లోపలికి వచ్చారు.

"అమ్మా! నాన్నగారు ఏరి?" అని మాలతి వంక తిరిగి, "మీరు అలా కూర్చోండి" అంది లత.

మాలతి సోఫాలో కూర్చుంది.

లత తిరిగి—"నాన్నగారువెళ్ళిపోయారా ఏం?" అంది ఆత్రతగా.

"అవునమ్మా. ఆఫీసులో అర్జెంటు పని ఉందట. అందుకోసం చెప్పి వెంటనే వెళ్ళిపోయారు." అంది కళ్ళు కిందికి దించుకుని.

లత ముఖం జేవురించిపోయింది. మాలతి ముఖం మలినం అయిపోయింది. ఆమె ముఖంలోకి చూడటానికి ఎవరికీ ధైర్యం లేకపోయింది.

లత అందరికన్న ముందు తేరుకుని మాలతి పక్కను కూర్చుంది. "ఒక పని చేద్దాం అండీ. మీరు టెలిఫోన్‌లో మాట్లాడండి" అంది.

మాలతి లత వంక ఆప్యాయంగా చూసింది.

"పదండి టెలిఫోన్ చూపిస్తాను" అంది.

మాలతి తల అడ్డంగా ఊపి, "లాభం లేదు, తల్లీ. ఇది టెలిఫోన్ మీద అయ్యే పని కాదు. వస్తాను. మీ అందరికీ అనవసరంగా శ్రమ కల్పించాను" అని లేచింది. ఆమె ముఖం తిరిగి కళా కాంతులతో ప్రజ్వరిల్లి పోయింది.

లత ఆమె జీవిత సమస్యను ఎంత తేలిగ్గా ఎదుర్కోగలదు అని ఆశ్చర్య పోయింది.

శారద— "ఇంత ఎండలో ఎలా వెళ తారు? చల్లబడ్డాక వెళ్ళండి" అంది.

"మీ అభిమానానికి కృతజ్ఞతలు. నేను అనాలోచితంగా వచ్చి కష్టాలం తెచ్చినట్టున్నాను. నన్ను క్షమించండి."

శారద—"అంతమాటనకండి. మీరు చేసింది ఏమీ లేదు. ఆయన ఏదో పని తొందరలో వెళ్ళిపోయారు" అంది.

"ఏది ఏమయినా భోజనం చెయ్య కుండా వెళ్ళిపోటానికి కారణం నేను. సహాయం హక్కుగా భావించాను. హక్కు అని నేను అనుకున్నంత మాత్రాన అయి పోదుగా? అవతలి వాళ్ళు కూడా ఒప్పుకో వాలిగా? మిమ్మల్ని కలుసుకునే భాగ్యం లభించింది. మా ఇంటికి ఒక సారి రండి" అని చేతులు జోడించింది.

లతకు ఆమెను కౌగిలించుకోవాలని పించింది. ఆమెకు ఎంత కాన్ఫిడెన్స్! అందుకే వాళ్ళ నాన్నకు జీవితంలో అంత విరక్తి కలిగిందేమో? అమ్మ జాగాలో ఈమె ఉంటే ఎలా ఉండేది? ఛీ! మనస్సు కోతిలాంటిది అనుకొంది ఎదు




- కోలా మోహనరావు

అతని వంక కళ్ళు ఆర్పకుండా చూడ్డ ప్రారంభించింది.

"మీకు పరిచయం చెయ్యలేదుకదూ" అని మాలతి పరిచయం చెయ్యబోయింది.

"పరిచయం అవసరంలేదులే, అమ్మా, మల్లిక చెప్పింది" అని లత వంక తిరిగి, "నా పేరు ఆనంద్. ఖాళీగా కూర్చోవడం ఇష్టంలేక పిహెచ్. డి. వంకతో కాలేజీలో తిరుగుతుంటాను" అని నవ్వాడు.

లత నవ్వింది, కాని, ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

"వెళ్ళిన పని అయిందా, అమ్మా?" అని ఆనంద్ అడిగాడు.

మాలతి ఆనంద్ వంక ఆశ్చర్యంగా చూసి తరవాత గంభీరంగా ఉండిపోయింది. ఆనంద్ ఆమె వంక ప్రశ్నార్థకంగా చూసి, ఆమె మౌన ముద్రలోని సమాధానం అర్థం చేసుకున్నాడు. తరవాత విసురుగా—"నేను వద్దంటే విన్నావు కాదు" అన్నాడు.

మాలతి కోపంతో సమాధానం చెబుదామని అనుకుంది కాని, ఆనంద్ చరచర వెళ్ళిపోయాడు.

లత మనస్సు క్రుంగిపోయింది. ఆ రెండు వాక్యాల్లోని మథనం, వ్యథ అర్థం చేసుకో గలిగింది. మాలతి మనస్సులో చెలరేగే తుఫాను అర్థం చేసుకోగలిగింది. మాలతి రెండు చోట్ల ఓటమి పొందింది. ఒకటి రామనాథం ఇంటి దగ్గర. రెండవది తన ఇంట్లో. ఇద్దరు మౌనంగా ఉండిపోయారు.

అంతలో మల్లిక ట్రేలో రుహాఫ్జా మూడు గ్లాసుల్లో నింపి తీసుకువచ్చింది. అందులో మంచు గడ్డలు నాట్యం చేశాయి. లత దగ్గరకు వెళ్ళి, "తీసుకోండి. రుహాఫ్జా మీకు ఇష్టమో, లేదో తెలియదు. వేసవికాలంలో పోయే ప్రాణం తోకపట్టుకుని వెనక్కి లాక్కొస్తుందంటాడు మా అన్నయ్య" అంది నవ్వుతూ.

"థాంక్స్. అది మమ్మాటికి నిజం" అని గ్లాసు అందుకుంది. మల్లిక తల్లికి ఒకటిచ్చి, తను ఒకటి తీసుకుని కూర్చుంది.


"మీరు ఏం చేస్తున్నారు?" అని మల్లిక ప్రశ్నించింది.

"ఎమ్. ఎ. సైకాలజీ చదువుతున్నాను. ఈ సంవత్సరం ఫైనల్ ఇయరు."

"అమ్మ బాబోయ్! సైకాలజీ అంటే నేను ఆమడదూరంలో నించుంటాను"

"లత కథలు వ్రాస్తుంది" అంది మాలతి.

"నిజంగా? దటీజ్ రియల్లీ గ్రేట్. మీలో లిటరరీ టాలెంట్ సహజంగా ఉన్నదన్నమాట."



కంటకావృతం

ఫోటో— బి. సి. రెడ్డి ( హైదరాబాదు )

"ఏదో అప్పుడప్పుడు కాలక్షేపం కోసం వ్రాస్తాను. అవి బాగుండాలని లేదుగా?"

"బాగాలేకపోతే ఏ ఎడిటరు తీసుకుంటారండీ!"

లత గ్లాసు ఖాళీచేసి పెగ్ టేబిల్ మీద పెట్టి లేచి నించున్నది.

"థాంక్స్. మిమ్మల్ని కలుసుకోవటం నా అదృష్టం. మీరు నమ్మండీ, నమ్మక పోండీ— నేను హృదయపూర్వకంగా అంటున్నమాట" అంది మాలతితో.

"చిన్నదానివయినా మాటలు కురిపించేస్తున్నావు. దీనికి సమాధానం నేను ఏమని చెప్పాలో నువ్వే చెప్పు" అంది మాలతి నవ్వుతూ.

"ఏమీ వద్దు. నన్ను అర్థం చేసుకుంటే అదే పదివేలు" అంది.

"నిన్ను అర్థం చేసుకోలేనూ ... పిచ్చిపిల్ల!" అని భుజం మీద చెయ్యి వేసింది. లత మల్లిక వంక చూసి, "వస్తానండి. విష్ యూ గుడ్ లక్" అంది.

"థాంక్స్. మళ్ళీ రండి" అంది మల్లిక.

"తప్పక వస్తాను" అంది లత.

ఇద్దరు లతతో కారుదాకా వెళ్ళారు. లత కారు స్టార్టు చేసి చెయ్యి ఊపుతూ కారును స్పీడుగా పోనిచ్చింది. సందు మలుపులో కారు ఆపి కొన్ని క్షణాలు ఆలోచించి కారును దాబారావు ఇంటి వైపు పోనిచ్చింది.

మర్నాడు మల్లిక ఇంటర్వ్యూకి వెళ్ళేటప్పటికి పదిహేను మంది అప్పుడే కూర్చుని ఉన్నారు.

"ఏమిటి, మీరుకూడా ఇంటర్వ్యూకేనా?" అని తల పట్టుకున్నాడో సూటు వాలా.

మల్లిక కోపంగా చూసి, "అప్పుడే ఏమయింది. వందమంది వస్తున్నారట ఇంటర్వ్యూకి" అంది.

"ఇంటర్వ్యూ ఫార్స్, బ్రదర్! సెలక్షన్ ముందే అయిపోయిందట. ఇది కేవలం వినోదానికి."

"వినోదమా!" ఒక లూజు పాంటు ప్రశ్న.

"అవును. వాళ్ళు అడిగే ప్రశ్నలకు మన సొరకాయ కోతలు వినోదంగా ఉంటాయి. ఆ మధ్య ఎవరో అడిగారట— రాజేంద్రప్రసాద్ ఎవరు అని. దానికి సమాధానం భారీ ఎత్తున అప్పులిచ్చే ఆసామి అని ఇచ్చాడట. బుల్‌డోజర్ అంటే ఏమిటి అని అడిగారట. సమాధానం ఆంబోతులకు నిద్ర ఇచ్చే మాత్రలు అన్నాడట. వరదలకు ఉపాయం ఏమిటి అని అడిగితే వంతెనలు కట్టండి అన్నాడట కాండిడేట్."

అందరు గొల్లుమన్నారు.

"అయితే వరదలకు ఉపాయం వంతెనలు కావా?" అని అడిగాడు ఒక సైడ్ బర్న్స్ వాలా.

"అయ్యా! చూడండి. ఆ సమాధానం ఈయనే ఇచ్చి ఉండాలి" అన్నాడు కాలర్లు సర్దుకుంటూ ఒక చిన్నవాడు. అందరు నవ్వారు. సైడ్‌బర్న్స్‌వాలా కోపం ప్రకటించి వెళ్ళి బెంచి మీద కూర్చున్నాడు.

అంతలో యూనిఫారంలో ఉన్న దర్వాన్ వచ్చి, "విజయ్ కుమార్" అని పిలిచాడు.

విజయకుమార్ టై సర్దుకుని, పాంటు పైకి లాగి లోపలికి ప్రవేశించాడు.

"అయ్యా! జాతర ఆరంభం" అన్నాడు ఒక బట్టతల ఆయన.

ఈ సారి ఎవ్వరు నవ్వలేదు. అందరి హృదయస్పందన వేగం పుంజుకుంది.

అయిదు నిమిషాల తరవాత విజయకుమార్ బయటకు వచ్చాడు. అందరు అతని చుట్టూ గుమిగూడారు.

"ఇదిగో, నన్ను విసిగించకండి. నేను చెప్పేది ఒక్కసారే వినండి. అడిగిన ప్రశ్నలు—సూర్యుడి వైశాల్యం ఎంత? చంద్రమండలం దూరం ఎంత? నీ జీవిత ప్రమాణంలో ఎన్ని బియ్యం తింటావు? మిస్ వర్ల్డ్ కొలతలు ఏమిటి? డెన్ యూ గో టు హెల్, ఆల్ ఆఫ్ యూ" అని పళ్ళు పటపటలాడించి విసవిసా వెళ్ళిపోయాడు.

